గిరిజన రైతులే టార్గెట్

- మిర్చి విత్తనాలు విక్రయిస్తున్న గుర్తుతెలియని వ్యక్తులు
- కారు, ద్విచక్ర వాహనాల్లో ఏజెన్సీ గ్రామాల్లో సంచారం
- తక్కువ ధరకు ఇస్తామంటూ యామమాటలతో మోసం
- పోలీస్, వ్యవసాయ బృందాలు తనిఖీలు చేస్తున్న ఆగని సంచార విక్రయాలు

మిర్చి విత్తనాల ప్యాకెట్

బయ్యారం, జూన్ 14 : ఏజెన్సీలోని గిరిజన రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని, కొందరు విత్తన వ్యాపారులు ఊరూపేరూ లేని విత్తనాలను అంటగడుతున్నారు. 'మా విత్తనాలు అధిక దిగుబడిని ఇస్తాయి.. ధర కూడా తక్కువే' అంటూ మాయమాటలతో బురిడీ కొట్టించి, నిలువునా ముంచుతున్నారు. బయ్యారం మండలంలోని ఉప్పలపాడు, నర్సాతండా, గొల్లగూడెం, లక్ష్మీనర్సింహాపురం, బాలాజీపేట, వెంకట్రాంపురం, చోక్లతండా, సంగ్యాతండా, వినోబానగర్, గౌరారం, జనార్దనపురం, లక్ష్మీపురం, సాంబతండా, దొరన్నతండా, మిర్యాలపెంట, బీమ్లాతండా, అల్లిగూడెం, కాచనపల్లి, కిష్టాపురం, కంబాలపల్లి గ్రామాల్లో అత్యధికంగా మిర్చి పంట సాగవుతున్నది. గతేడాది మండలంలో సుమారు 2500 ఎకరాల్లో మిర్చిపంట వేశారు. ఈ సారి కూడా వానకాలం ప్రారంభం కావడంతో రైతులు భూములను సిద్ధం చేసుకొని, విత్తనాల కొనుగోలు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ఇక్కడి గిరిజన రైతులను టార్గెట్ చేసుకొని కొందరు సుదూర ప్రాంతాలకు చెందిన గుర్తు తెలియని విత్తన వ్యాపారులు గ్రామాల్లో సంచరిస్తూ నకిలీ మిర్చి విత్తనాల విక్రయానికి తెర లేపారు. కార్లు, ద్విచక్రవాహనాల్లో వివిధ కంపెనీలకు చెందిన మిర్చి విత్తనాల శాంపిల్ ప్యాకెట్లతో రైతుల వద్దకు వెళ్లి 'మేము ఇచ్చే కంపెనీ విత్తనాలు మంచివి.. మంచి దిగుబడి వస్తుంది.. రేటు కూడా తక్కువే' అంటూ మాయమాటలతో బురిడీ కొట్టిస్తున్నారు. అమాయకంగా గిరిజన రైతులు వారి మాటలు నమ్మి విత్తనాల కోసం అడ్వాన్స్‌లు ఇస్తున్నారు. మరికొందరు విత్తన ప్యాకెట్ల కోసం బుకింగ్ చేసుకుంటుండగా, వారం రోజుల్లో తెచ్చి ఇస్తున్నారు. వాటికి రసీదులు మాత్రం ఇవ్వడం లేదు.

కొన్ని గ్రామాల్లో విక్రయాల కోసం ప్రత్యేకంగా ఏజెంట్లను కూడా ఏర్పాటు చేసుకొని అమ్ముతున్నారు. గతేడాది కూడా ఇలాగే విత్తనాలు కొనుగోలు చేసి, చాలా మంది రైతులు దిగుబడి రాక నష్టపోయారు. కాగా, ఎరువులు, విత్తన విక్రయాల్లో అవకతవకలు జరుగొద్దనే ఉద్దేశంతో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ప్రత్యేక దృష్టిసారించి తనిఖీలు జరపాలని అధికారులను ఆదేశించారు. దీంతో పోలీస్, వ్యవసాయశాఖ అధికారులు టాస్క్‌ఫోర్స్ టీమ్‌గా ఏర్పడి కొన్ని రోజులుగా మండలంలోని పురుగు మందులు, విత్తన దుకాణాల్లో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. అయినా ఏజెన్సీ గ్రామాల్లో గుర్తు తెలియని విత్తన వ్యాపారుల దందా మాత్రం ఆగడం లేదు. లైసెన్స్ పొందిన విత్తన దుకాణాల్లో 10 గ్రాముల విత్తన ప్యాకెట్ ధర కంపెనీని బట్టి రూ.450 నుంచి రూ.750 వరకు విక్రయిస్తున్నారు. ఎకరాకు పది (100 గ్రాములు) ప్యాకెట్లు అవసరం కాగా, గ్రామాల్లో సంచరించే వ్యాపారులు ప్యాకెట్‌కు రూ.50 నుంచి రూ.100లు వరకు తక్కువగా ఇస్తామనడం, ఏజెంట్లు ఒత్తిడి చేయడంతో రైతులు కొనుగోలు చేస్తున్నారు. వాటికి సరైన బిల్లులు కూడా ఇవ్వడం లేదు. రైతులు కొనుగోలు చేశాక విత్తనం మొలకెత్తకపోయినా, దిగుబడి రాక పోయినా ఎవరిని అడగాలో తెలియని పరిస్థితి. రైతులు మోసపోయే ప్రమాదం ఉన్నది.

గుర్తు తెలియని వ్యాపారుల వద్ద కొనవద్దు

గుర్తు తెలియని వ్యాపారుల వద్ద రైతులు విత్తనాలు కొనద్దు. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తూ నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారనే సమాచారంతో అప్రమత్తమయ్యాం. పోలీస్ శాఖ సహకారంతో వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకొంటా. రైతులు లైసెన్స్ పొందిన షాపుల్లోనే ఎరువులు, విత్తనాలను కొనాలి. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తూ విక్రయాలు జరిపితే సమచారం ఇవ్వండి. కఠిన చర్యలు తీసుకుంటాం.

- రాంజీనాయక్, వ్యవసాయ శాఖ అధికారి, బయ్యారం

హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి అవార్డులను అందుకుంటున్న మానుకోట రెడ్‌క్రాస్ బాధ్యులు

మానుకోట రెడ్‌క్రాస్‌కు రాష్ట్రస్థాయి అవార్డులు

మహబూబాబాద్, జూన్ 14 : మహబూబాబాద్ రెడ్‌క్రాస్ సొసైటీకి రాష్ట్రస్థాయి అవార్డులు దక్కాయి. శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో మానుకోట రెడ్‌క్రాస్ సొసైటీకి రాష్ట్రస్థాయి అవార్డులను మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర రెడ్ క్రాస్ ఉపాధ్యక్షుడు, ఐఏఎస్ బుర్ర వెంకటేశం ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ రెడ్‌క్రాస్ చైర్మన్ పీవీ ప్రసాద్ మాట్లాడుతూ... రెడ్‌క్రాస్ సొసైటీ దేశవ్యాప్తంగా వివిధ రకాల సేవలు అందిస్తుందన్నారు. ఎక్కువ సార్లు రక్తదానం చేసిన గొర్రె వెంకన్న, ప్రోత్సహించిన సూపరింటెండ్, జిల్లా అదనపు కలెక్టర్ ఎం డేవిడ్, బంజారా యూత్ అసోసియేషన్, మూడ్గులగూడెం, భగవత్‌తండాకు స్వచ్ఛంద సంస్థల విభాగంలో అవార్డు వరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ అజయ్‌మిశ్రా, సీఈవో మదన్‌మోహన్ పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

రైతుకూలీ సంఘం ధర్నా

తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గూడూరు, జూన్14 : రైతు రుణ మాఫీ, పెట్టుబడి సహాయం వంటి హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ముందు రైతులు ధర్నా నిర్వహించారు. ఆర్ఐ కోమలకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర కోశాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతులకు అన్ని రకాల విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీని చేయాలన్నారు. కొత్త రుణాలతోపాటు పెట్టుబడి సాయం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు యాకన్న, పెనక భరత్, టేకుమట్ల సమ్మన్న, ఓరే వెంకన్న, జనార్దన్, లక్ష్మయ్య, లక్ష్మి, రజిత, శివకుమార్, జంపయ్య పాల్గొన్నారు.

పంట రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలి

బ్యాంక్ ముందు నిరసన తెలుపుతున్న రైతు సంఘ నాయకులు

తొర్రూరు, జూన్ 14: రైతుల పంట రుణాలు మాఫీ చేసి, వెంటనే కొత్త రుణాలు ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి కొత్త వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని బ్యాంకు మేనేజర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందుకు రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులు అమ్మకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బొల్లం అశోక్, తాళ్ల వెంకటేశ్వర్లు, రాపోలు వీరన్న, ధరావత్ యాకన్న, వెంకన్న, నక్క ప్రశాంత్, గుంటుక బొందయ్య, రాములు, ఎల్లయ్య, వెంకన్న, శ్రీను పాల్గొన్నారు.

చేతిరాతలో నైపుణ్యం పెంచుకోవాలి

జనగామ, జూన్ 14 (నమస్తే తెలంగాణ) : విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే చేతిరాతలో నైపుణ్యం పెంచుకోవాలని పట్టణంలోని 28వ వార్డు కౌన్సిలర్ ఎండీ సమద్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఎస్ఆర్ ట్యూషన్ అకాడమీ సమ్మర్ క్యాంపు ముగింపు సందర్భంగా ఉత్తమ చేతిరాతలో ప్రతిభ చూపిన విద్యార్థులకు శుక్రవారం సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. అకాడమీ నిర్వాహకులు అన్వర్ మాట్లాడుతూ ఎస్ఆర్ ట్యూషన్ అకాడమీలో విద్యార్థులకు హిందీ, తెలుగు, ఇంగ్లిష్, గణితంలో బేసిక్ క్లాసులు నేర్పిస్తామన్నారు. చేతిరాత ట్రెయినర్ మెరాజ్, నిర్వాహకులు అనిత, జ్యోతి పాల్గొన్నారు.

ఎంపీడీవోకు వినతిపత్రం అందచేస్తున్న సీఐటీయూ నాయకుడు సైదులు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నెల్లికుదురు, జూన్ 14 : గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుల పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఇస్సంపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పారిశుధ్య కార్మికులతో స్థానిక అంబేద్కర్ సెంటర్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ఎంపీడీవో బాలరాజుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు 10 నెలలుగా వేతనాలు అందక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు మారబోయిన శ్రీనివాస్, కార్యదర్శి బొల్లం ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు తుల ఎల్లయ్య, నాయకులు భాష, వెంకన్న, విజయ, శ్రావణి, సుభాన్, వీరస్వామి, చంద్రయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలను సద్వినియోగం చేసుకోవాలి

గార్ల, జూన్ 14: ప్రభుత్వ కళాశాలను గ్రామీణ ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గార్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ గోవిందరావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని, విద్యార్థులు అడ్మిషన్లు పొందాలన్నారు.

'ప్రభుత్వ బడిలో చేర్పించాలి'

అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంపీడీవో సిలార్ సాహెబ్

తొర్రూరు, జూన్ 14: 'ప్రభుత్వ బడిలో చేర్పించండి.. ఊరి బడిని కాపాడండి' అని ఎంపీడీవో సిలార్ సాహెబ్ కోరారు. శుక్రవారం ఆయన మండలంలోని వెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో జరిగిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో అక్షరాలు దిద్దించారు. ఈ సం దర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతున్నదని, ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు, మధ్యాహ్న భోజన వసతిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల సూపరింటెండెంట్ గోపాల్, కమ్యూనిటీ కో ఆర్డినేటర్ రేణుక, హెచ్‌ఎం స్వాతి, గ్రామ కార్యదర్శి సీహెచ్ సుమన్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఎస్ మాధవి, వీవోఏ రజిత, మహిళా సంఘాల ప్రతినిధులు కవిత, స్వప్న, ఉపాధ్యాయురాలు హారికతోపాటు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

మహబూబాబాద్ రూరల్, జూన్ 14 : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతున్నదని ఈదులపూసపల్లి జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పూజారి వీరయ్య అన్నారు. శుక్రవారం పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బాలసభను నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విద్య, తెలంగాణ సంస్కృతిపై చేసిన విద్యార్థులు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వరూపరాణి, ప్రవీణ్, రామ్మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, పుల్లయ్య పాల్గొన్నారు.

రక్తదాతలను సన్మానిస్తున్న జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలి

తొర్రూరు, జూన్ 14: రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు డాక్టర్ కుందూరు రాజేందర్ రెడ్డి అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం డివిజన్ కేంద్రంలోని వికాస్ హైస్కూల్‌లో రక్తదానంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. దాదాపు 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ బహుమతి సాయి వికాస్ హైస్కూల్, ద్వితీయ పీ కీర్తన, తృతీయ ఆర్ అక్షిత్, రెండు కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ కిరణ్‌కుమార్, మన్నూరు కోటయ్య వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వికాస్ హైస్కూల్ కమిటీ చైర్మన్ రేగూరి వెంకన్న, హైస్కూల్ కరస్పాండెంట్ రమేశ్, రెడ్ క్రాస్ సొసైటీ పాలక సభ్యులు విశ్వేశ్వర్‌రావు, లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు జోన్ చైర్మన్ సారథి వెంకన్న పాల్గొన్నారు.

అన్ని దానాల్లో కెల్లా రక్తదానం గొప్పది..

తొర్రూరు : అన్ని దానాల్లోకెల్లా రక్తదానం ఎంతో గొప్పదని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్ అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా మదర్ వలంటరీ ఆర్గనైజేషన్ మండల అధ్యక్షుడు కాసోజు సాయినాథ్ ఆధ్వర్యంలో రక్తదాతలను సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ నారాయణ, సంస్థ పయ్యావుల ప్రవీణ్‌యాదవ్, మియాపురం రమాకాంత్, కృష్ణ, క్రాంతికుమార్, సురేశ్‌బాబు, అన్వేశ్, దినేశ్ పాల్గొన్నారు.

ఎన్నికైన సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

మున్నూరు కాపు పటేల్ సంఘం ఎన్నిక

మహబూబాబాద్, జూన్ 14 : మహబూబాబాద్ మున్నూరు కాపు సంఘం అధ్యక్ష కార్యదర్శులుగా పిట్టల బుచ్చిరామారావు(రాము), పిట్టల శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక మున్నూరు కాపు సంఘం భవనంలో జరిగిన సమావేశంలో రాము మాట్లాడుతూ.. విద్య, వైద్యం, రాజకీయ, ఉద్యోగ పదోన్నతుల్లో కాపుల సమస్యలపై పోరాడుతామన్నారు. మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ కార్యదర్శి శంతన్‌రామరాజు ఆధ్వర్యంలో అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిన్నారెడ్డి శ్రీనివాస్, మద్దెల రమేశ్, ఆవుల కుమార్, పిట్టల చంద్రయ్య, బొళ్ల జగ్గయ్య, చెవ్వు చిరంజీవి, సుతారపు వెంకటనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

స్కాలర్‌షిప్‌నకు దంతాలపల్లి విద్యార్థి

దంతాలపల్లి, జూన్ 14: ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు దంతాలపల్లి జడ్పీఎస్ఎస్ విద్యార్థి ఎంపికైనట్లు హెచ్‌ఎం వేణుమాదవ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి రొయ్యాల భద్రీనాథ్ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ (ఎన్ఎంఎంఎస్)ఎంపికైనట్లు తెలిపారు. ఏటా విద్యార్థికి రూ.12వేల చొప్పున 4 సంవత్సరాలు రూ.48వేల స్కాలర్‌షిప్ వస్తుందని తెలిపారు. విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు శ్రీదేవి, సురేశ్, సురేందర్‌గుప్తా, వెంకన్న పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

VEHICLES FOR SALE

★AP36TB4574 Mekala Latha TATA SUPER ACE Mint 2013, TS07UC5388 Asif Shareef Syed TATA ACE 2016, TS03UA7502 Vinay Kumar Devunuri TATA ACE 2015, Acution Date: 15-06-2024, Venue: Shriram Automall India Ltd., Punnel Cross Road Bollikunta, Warangal, Cont: Shriram Finance Limited, H.No. 15-1-237, 2nd Floor, Opp. L.B. Collge, Mulugu Road, Cell: 9849981545, 9966196881.
NTW-00

కావలెను

jobs Apply Now!

★HIV Prevention Programలో పని చేయుటకు అనుభవం గల Female GNM & ORWలు కావలెను. Send your Resume on or before 15/6/2024, rdmm.wgl@gmail.com, Cont: 9849688581, 9959711470.
NTW-323319

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565

'ఎర్రబెల్లి' పార్టీ మార్పు ప్రచారం అవాస్తవం

జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్

తొర్రూరు, జూన్ 14: రెండు రోజులుగా సోషల్ మీడియా వేదికగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, దానిని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదని జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చెయ్యాలని, లేకపోతే ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. స్వార్థ పూరిత రాజకీయాల కోసం పార్టీ మారాల్సిన అవసరం దయాకర్‌రావుకు లేదన్నారు. ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజల తరపున నిలబడి పోరాటం చేస్తామన్నారు. తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నిజ స్వరూపాన్ని బట్టబయలు చేస్తామన్నారు. అపారమైన అనుభవమున్న నాయకుడిగా, అనేక పదవులను పొంది ఈ వయసులో పార్టీలు మారి, అధికార దాహం కోసం వెంపర్లాడే అవసరం తనకు లేదని దయాకర్‌రావు మీడియా వేదికగా స్పష్టం చేసిన తీరును దుష్ప్రచారం చేసే వారు గమనించాలని కోరారు.

అధిక చార్జీలు వసూలు చేయొద్దు

అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్

జనగామ చౌరస్తా, జూన్ 14 : మీ సేవ కేంద్రాల్లో వినియోగదారుల నుంచి అధిక చార్జీలు వసూలు చేయొద్దని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లాలోని మీ సేవ కేంద్రాల నిర్వాహకులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. రోహిత్‌సింగ్ మాట్లాడుతూ మీ సేవ కేంద్రాలకు వచ్చే వినియోగదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని నిర్వాహకులు, ఆపరేటర్లకు సూచించారు. కేంద్రాలను కేటాయించిన ప్రాంతంలో మాత్రమే మీసేవ కేంద్రాలు నిర్వహించాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్, ఇతర సర్టిఫికెట్ల జారీలో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హత్యాయత్నం కేసులో
భర్తకు పదేళ్ల జైలు

జనగామ చౌరస్తా, జూన్ 14 : భార్యపై హత్యాయత్నం చేసిన భర్తకు పదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధిస్తూ జిల్లా కోర్టు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి విక్రమ్ శుక్రవారం తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం.. రఘునాథపల్లి మండలం జాఫర్‌గూడేనికి చెందిన బత్తుల నర్సయ్యకు నర్మెట మండలం గండిరామారానికి చెందిన రజితతో వివాహం జరిగింది. భార్యపై అనుమానం పెంచుకున్న నర్సయ్య 2022సంవత్సరంలో రజితపై గొడ్డలితో హత్యాయత్నం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం ఈ కేసుపై కోర్టులో జరిగిన వాదోపవాదనల అనంతరం నేరం రుజువు కావడంతో జడ్జి విక్రమ్ నేరస్తుడు నర్సయ్యకు పదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసులో బాధితురాలి తరపున న్యాయవాది పీపీ స్టీఫెన్, సహాయకురాలు శ్రీదేవి వాదనలు వినిపించారని పోలీసులు తెలిపారు.

డ్రమ్ సీడర్ సాగు లాభదాయకం

డ్రమ్ సీడర్‌పై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ రాంబాబు

తొర్రూరు, జూన్ 14 : వరి సాగులో డ్రమ్ సీడర్ పద్ధతి లాభదాయకమని కేవీకే మల్యాల శాస్త్రవేత్త డాక్టర్ రాంబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని కర్కాల గ్రామంలో ఐటీసీ ఎంఎస్‌కే భద్రాచలం వారి సహకారంతో ఎఫర్ట్ సంస్థ ఆధ్వర్యంలో బ్లేస్సీ రైతు వనికరణ సంఘ రైతులకు డ్రమ్ సీడర్, వేద జల్లే పద్ధతిలో వరి సాగు పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన సాంకేతికతను ఎప్పటికప్పుడు రైతులకు చేరవేయడంలో ఎఫర్ట్ సంస్థ కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్టు కో ఆర్డినేటరు కే రమేశ్, టీ రమేశ్, కమ్యూనిటీ ఆర్గనైజర్ రవీందర్‌తోపాటు రైతులు ఎర్ర వెంకటరెడ్డి, మల్లారెడ్డి, నంగునూరు మల్లయ్య, వెంకటేశ్వర్లు, సోమయ్య, కరుణాకర్‌రెడ్డి, తన్నీరు అశోక్, సైదులు, చంద్రమౌళి, సంజీవరెడ్డి, మల్లారెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

బీరిశెట్టిగూడెం బీసీ కాలనీలో టాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

బీరిశెట్టిగూడెంలో తాగునీటికి ఇబ్బందులు

దంతాలపల్లి, జూన్ 14: మండలంలోని బీరిశెట్టిగూడెం గ్రామ ప్రజలు తాగునీటి కోసం తండ్లాడుతున్నారు. గ్రామంలోని బీసీ కాలనీలో మూడు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామస్తులు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ అధికారులు ట్యాంకర్లతో నీరు సరఫరా చేసే క్రమంలో మహిళలకు ఘర్షణ జరుగుతున్నదన్నారు. అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతు పనులు చేయించి, తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

అనుమానాస్పదంగా మహిళలు

భయాందోళనలో స్థానికులు


రైల్వే స్టేషన్‌లో ఉన్న మహిళలు

కేసముద్రం, జూన్ 14 : కేసముద్రం మండల కేంద్రంలో ఇతర రాష్ట్రాలకు 30మంది మహిళలు, చిన్నపిల్లలు శుక్రవారం అనుమానాస్పదంగా సంచరించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కేసముద్రం రైల్వే స్టేషన్ నుంచి మహిళలు ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో స్థానికులు వారి ఫొటోలను తీసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై వంశీధర్ రైల్వేస్టేషన్‌కు చేరుకొని మహిళలను విచారణ చేయగా, రాజస్థాన్‌కు చెందిన మహిళలమని తెలిపారు. చిన్నచిన్న బొమ్మలు తయారు చేసి అమ్ముకుంటూ కుటుంబాలను పోషించుకుంటామని పోలీసులకు చెప్పారు. కాజీపేట నుంచి కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడకు వెళ్తున్న తమ వద్ద గ్యాస్ ఉన్నట్లు గుర్తించిన రైల్వే సిబ్బంది కేసముద్రంలో దించినట్లు తెలిపారు. ఎస్సై వంశీధర్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో వారిని విజయవాడకు పంపించారు.

ఆయిల్‌పామ్ అబ్జర్వరీ కమిటీ మెంబర్‌గా కృష్ణారెడ్డి

కృష్ణారెడ్డి

చిన్నగూడూరు, జూన్ 14 : మండలంలోని చిన్నగూడూరు గ్రామానికి చెందిన వల్లూరి కృష్ణారెడ్డి తెలంగాణ ఆయిల్‌మామ్ అబ్జర్వరీ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన ఆయిల్‌మామ్ ఎండీ కే అశోక్(ఐఏఎస్), మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే రామచంద్రూనాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

స్నేహితుడి కూతురికి అండగా పూర్వ విద్యార్థులు

కేసముద్రం, జూన్ 14 : 1996–97 సంవత్సరంలో ఎస్‌వీవీ స్కూల్‌లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ స్నేహితుడి కూతురి విద్యభ్యాసానికి అండగా నిలిచారు. పదో తరగతి మిత్రుడు వెంకటగిరి గ్రామానికి గాండ్ల అశోక్ అనారోగ్యంతో 2018లో మృతి చెందాడు. అంతకుముందే అతడి భార్య కూడా మృతి చెందడంతో వారి కూతురు శివాని అనాథగా మారింది. స్నేహితుడి కూతురు శివాని చదువుకయ్యే ఖర్చును మిత్రులే భరిస్తున్నారు. ఈ ఏడాది శివానిని నర్సంపేటలోని గీతాంజలి డీసీ స్కూల్‌లో చేర్పించారు. స్కూల్ ఫీజు, నోట్ బుక్‌లు, దుస్తుల కోసం మొత్తం రూ.45వేలు చెల్లించారు. ఈ కార్యక్రమంలో మృతుడు అశోక్ స్నేహితులు ఓమ సంతోశ్, జలగం అనిల్, సామల రమేశ్, సతీశ్ పాల్గొన్నారు.

ఇంటింటా మిషన్ భగీరథ సర్వే

కొమ్ములవంచలో సర్వేలో పాల్గొన్న డీఎల్‌పీవో పుల్లారావు

నర్సింహులపేట, జూన్ 14: మండలంలో ఇంటింటా మిషన్ భగీరథ సర్వే కొనసాగుతున్నది. శుక్రవారం మండలంలోని నర్సింహులపేట, కొమ్ములవంచ, కౌసల్యాదేవిపల్లి, పెద్దనాగారంస్టేజీ గ్రామాల్లో జరుగుతున్న సర్వేలో డీఎల్‌పీవో పుల్లారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీరు రానివారు దరఖాస్తు చేసుకుంటే, నీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సోంలాల్, పంచాయతీ కార్యదర్శులు వినోద్‌కుమార్, సాత్విక్, వనిత, అజయ్ గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేను విజయవంతంగా నిర్వహించాలి

నెల్లికుదురు : మిషన్ భగీరథ ఇంటింటి సర్వేను విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో బాలరాజు అన్నారు. శుక్రవారం ఆయన నెల్లికుదురు, నైనాల, పార్వతమ్మగూడెం, నల్లగుట్టతండా గ్రామాల్లో సర్వేను ఆయన ఎంపీవో పార్థసారధితో కలిసి పరిశీలించారు. సర్వే చేస్తున్న తీరు.., నిర్దేశించిన ఫార్మెట్‌ను పూరించే విధానాన్ని పరిశీలించారు. షెడ్యూల్ మేరకు సర్వేను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నైనాలలో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో బాలరాజు

రేషన్‌బియ్యాన్ని తరలిస్తే కఠిన చర్యలు

జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రోజారాణి

తరిగొప్పుల, జూన్14 : నిరుపేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రోజారాణి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని బేడ బుడిగజంగాల కాలనీ, బొంతగట్టునాగారంలోని ఇళ్లలో సోదాలు నిర్వహించారు. పది రేషన్ షాపులతోపాటు బొంతగట్టునాగారంలోని రేషన్‌షాపును ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోజారాణి మాట్లాడుతూ ప్రతి నెల 1 నుంచి 15వ తేదీ వరకు తెల్ల రేషన్‌కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయాలన్నారు. ఈపాస్ మిషన్‌లోని నిల్వలు, రేషన్ దుకాణంలోని నిల్వలు సమానంగా ఉండాలన్నారు. వీటిలో తేడా కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

'దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

పాలకుర్తి, జూన్14: మంత్రాల నెపంతో దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర కార్యదర్శి గుమ్మడిరాజుల సాంబయ్య అధికారులను కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నర్మెట మండల కేంద్రంలో నక్కల సత్తెమ్మ మంత్రాలు చేస్తున్నదనే నెపంతో స్థానికులు కొందరు ఈనెల 12న గొడ్డలితో దాడి చేశారని ఆరోపించారు. ఆధునిక యుగంలో మంత్రాలు లేవని, మూఢ నమ్మకాలతో కొందరు మోసపోతున్నారని సాంబ య్య తెలిపారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చూడాలని పోలీసులను కోరారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

స్నేహితుడి భార్యకు నగదు అందిస్తున్న చిన్ననాటి మిత్రులు

నర్సింహులపేట, జూన్ 14: నర్సింహులపేట మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆర్టీసీ ఉద్యోగి మంచినీళ్ల రవీందర్‌రెడ్డి కుటుంబానికి చిన్ననాటి మిత్రులు శుక్రవారం రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మిత్రులు ఉదయ్‌పాల్, వెంకటేశ్వర్లు, మల్లారెడ్డి, రంగారెడ్డి, రుద్ర, రాజు, యాకన్న, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.